





# కరపత్రం

SINCE 2014

సోమవారం ఏప్రిల్ 14 2025 | సంపుటి :0 | సంచిక :182 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# ‘భూభారతి’ కనీసం వందేళ్లు ఉంటుంది: సీఎం రేవంత్

వందేళ్ల పాటు వినియోగించుకునేందుకు వీలుగా భూభారతి వెబ్‌సైట్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.


హైదరాబాద్: వందేళ్ల పాటు వినియోగించుకునేందుకు వీలుగా భూభారతి వెబ్‌సైట్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో భూభారతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య రైతులకు సైతం అర్థమయ్యేలా భూభారతి వెబ్‌సైట్ ఉండాలన్నారు. అత్యాధునికంగా రూపొందించాలని కోరారు. భద్రతాపరమైన సమస్యలు రాకుండా పకడ్బందీగా ఫైర్‌వాల్ ఉండాలన్న సీఎం.. భూభారతి నిర్వహణ బాధ్యతను విశ్వసనీయ సంస్థకు అప్పగిస్తే బాగుంటుందని తెలిపారు. భూభారతి పోర్టల్‌ను సోమవారం జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రెవెన్యూ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ సీసీఎల్‌ఏ కార్యదర్శి మకరంద్ సహా పలువురు ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

జూన్ 2 నాటికి భూభారతి అమలు: మంత్రి పొంగులేటి

ముందుగా మూడు మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూభారతి అమలు చేస్తామని తెలిపారు. శాసనసభ ఎన్నికలకు ఇది రెఫరండం అవుతుందన్నారు. మే మొదటి వారంలో గ్రామపాలనాధికారులను నియమిస్తామని చెప్పారు.

- భూభారతి వెబ్‌సైట్‌ను వందేళ్ల పాటు వినియోగించుకునేలా అత్యాధునికంగా తీర్చిదిద్దాలని ఆదేశం.
- రైతులకు సైతం అర్థమయ్యేలా సులభంగా ఉండే ఇంటర్‌ఫేస్ డిజైన్ చేయాలని సూచన.
- భద్రతా పరిరక్షణకు శక్తివంతమైన ఫైర్‌వాల్, సురక్షిత డేటా వ్యవస్థ అవసరం అని సూచన.
- వెబ్‌సైట్ నిర్వహణ బాధ్యతను విశ్వసనీయ సంస్థకు అప్పగించాలన్న సూచన.
- భూభారతి పోర్టల్‌ను సోమవారం జాతికి అంకితం చేయనున్నట్టు సీఎం వెల్లడించారు.



## మార్క్ శంకర్‌తో కలిసి హైదరాబాద్ చేరుకున్న పవన్‌కల్యాణ్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తన కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ చేరుకున్నారు.



2లో

## టీజీపీఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు: రాకేష్‌రెడ్డి

పూర్తి ఆధారాలతో గ్రూప్-1 అవకతవకలు బయటపెట్టామని, టీజీపీఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తేలేదని భారాస నేత రాకేష్ రెడ్డి అన్నారు.



2లో

## కాలయాపన ఇంకెన్నాళ్లు?..

టన్నెల్‌లో చిక్కుకున్న ఆరుగురి పరిస్థితేంటి?: హరీశ్‌రావు



2లో

- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 8 కుటుంబాల్లో విషాదం నెలకొన్నదని ఆరోపణ.
- కుటుంబ సభ్యుల ఆవేదన అరణ్య రోదనగా మారిందని వ్యాఖ్య.
- సహాయక చర్యల సమన్వయంలో విఫలం, తీవ్రంగా ఆలస్యం, దిశా నిర్దేశం లేని చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు ఉదాహరణగా పేర్కొన్నారు.

## బిల్డర్ల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం

నిర్మాణ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.





హైదరాబాద్: నిర్మాణ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. బిల్డర్ల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆదివారం నిర్వహించిన ‘సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్’ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఉత్తమ్ హాజరయ్యారు.

2లో

## ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి మృతి.. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం వల్లేనంటూ వాహనదారుల ఆందోళన




2లో

## రేవంత్ లాంటి మోసగాడిని నమ్మినందుకు తెలంగాణ ఆగమైంది : కేటీఆర్



2లో

మేడ్చల్ మల్కాజ్‌గిరి : తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి లాంటి మోసపూరిత నేతను నమ్మిన ఫలితంగా తీవ్రంగా మోసపోయారని, రాష్ట్రానికి చివరికి చేతిలో మిగిలింది చిప్పే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

## రెండురోజులు ఈ జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు.. ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..



2లో

## భారత్‌కు చిక్కకుండా తప్పించుకునేందుకు తహవ్వుర్ రాణా 33 సాకులు..!

- భారత్ చేతికి దొరక్కుండా ఉగ్రవాది తహవ్వుర్ రాణా విశ్వప్రయత్నాలు చేశాడు
- తన శరీరం జబ్బుల మయం అయినట్లు అమెరికా ప్రభుత్వాన్ని నమ్మించే యత్నం చేశాడు
- కానీ, ట్రంప్ సర్కారు ఇవేవీ పట్టించుకోలేదు.




మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఏప్రిల్ 14 2025

# విద్యుత్ షాక్తో ఒకరి మృతి



**బెల్లంపల్లి, కరపత్రం ప్రతినిధి, ఏప్రిల్ 13:**
నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన ధర్మరాజుల శ్రీనివాస్ (43) ఆదివారం విద్యుత్ షాక్ తో మృతి చెందినట్లు నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఇంట్లో టేపు రికార్డర్ ను సోల్డరింగ్ వైర్ తో మరమ్మత్తులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు మృతి



**కరపత్రం మందమర్రి ఏప్రిల్ 13:-**
పట్టణంలోని యాపల్ ప్రాంతంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అంగన్వాడి ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం అంగన్వాడీ ఉపాధ్యాయురాలు మహంకాళి భూదేవి (65) ఆదివారం అవసరం నిమిత్తం ఏరియా జిఎం కార్యాలయం వైపు గల కిరాణా దుకాణానికి వెళ్లి, మరల ఇల్లందు గెస్ట్ హౌస్ వైపు ఉండే తన ఇంటికి తిరిగి వస్తూ ఉండగా, జాతీయ రహదారి 363 ను దాటుతున్న క్రమంలో బెల్లంపల్లి వైపు నుండి మంచిర్యాల వైపుకు వేగంగా వెళుతున్న కారు (టీఎస్ 19 టి 5562)ను, డ్రైవరు అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ, రోడ్డును దాటుతున్న భూదేవిని ఢీకొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి కుమారుడు మహంకాళి మోహన్ రాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు రహదారిని నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే దాటాలని, ఒకవేళ కొన్ని సందర్భాలను దాటవలసి వచ్చినప్పుడు జాగ్రత్తగా చూసుకొని, దాటాలని, దీంతో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉండదని తెలిపారు. అదేవిధంగా జన సమూహ ప్రాంతాలలో వాహనదారులు సైతం నెమ్మదిగా, జాగ్రత్తగా, చూసుకొని వెళ్లాలని సూచించారు.

# చలో వరంగల్ బిఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయండి



**కరపత్రం మందమర్రి ఏప్రిల్ 13:-**
బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 27న వరంగల్ లో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ రాజా రమేష్, టిబిజికేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ లు కోరారు. ఆదివారం పట్టణంలోని టిబిజికేఎస్ యూనియన్ కార్యాలయంలో చలో వరంగల్ బిఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలు, టిబిజికేఎస్ నాయకులు, విద్యార్థి, సోషల్ మీడియా, మహిళ నాయకులు పాల్గొన్నారు.

# జార్జి రెడ్డి ఆశయాల సాధనకై పోరాడాలి

- పాఠ్యపుస్తకాలలో జార్జిరెడ్డి జీవిత చరిత్రను పొందుపరచాలి
- పిడిఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి శ్రీకాంత్

**కరపత్రం, ఏప్రిల్ 13 (మంచిర్యాల బ్యూరో):-**
ఉస్మానియా ధృవతార జార్జిరెడ్డి అమరత్వాన్ని స్మరించుకుంటూ విద్యార్థులు, యువకులు ఆయన ఆశయ సాధనలో విద్యలో మనువాద భావజాలాన్ని రద్దు చేయడానికి ఉద్యమాలు చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో పిడిఎస్యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఉస్మానియా క్రాంతి ధార కామ్రేడ్ జార్జి రెడ్డి 53వ వర్థంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి, ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పిడిఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి శ్రీకాంత్ మాట్లాడుతూ, ఉస్మానియా యూనివర్సిటీలో మతోన్మాదానికి, మహిళలపై లైంగిక దాడులకు వ్యతిరేకంగా పిడికిలి బిగించి, పోరాడిన విప్లవ, విద్యార్థి నాయకుడు జార్జి రెడ్డి, క్యాంపస్ లో జరుగుతున్న అన్యాయాలను, లంపెన్ గుండాల దాడులను ఎదిరించాడని తెలిపారు. సమసమాజ స్థాపనకు ఉద్యమిస్తున్న జార్జి రెడ్డి ఎదుగుదలని జీర్ణించుకోలేని మతోన్మాద గుండాలు ఆయనను హత్య చేశారన్నారు. ఆయన ఆశయాల సాధనకై పోరాడాలని, అమరత్వాన్ని స్మరించుకుంటూ, మనువాద భావజాలాన్ని రద్దు చేయడానికి ఉద్యమించాలన్నారు. జార్జి రెడ్డి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యూ జిల్లా ఉపాధ్యక్షుడు పి సికిందర్, నాయకులు శశి కుమార్, మధు, మోహన్, నిరాజ్ లు పాల్గొన్నారు.




## భారత్‌కు చిక్కకుండా తప్పించుకునేందుకు

# తహవ్వుర్ రాణా 33 సాకులు..!

మొదటిపేజీ తరువాయి
తనను భారత్‌కు అప్పగించకుండా అమెరికా ప్రభుత్వానికి తహవ్వుర్ రాణా చాలా కుంటిసాకులు చెప్పాడు. చట్టపరమైన మార్గంలో ఎన్ని అవకాశాలున్నాయో అన్నింటినీ వాడుకొనేందుకు తీవ్రంగా యత్నించాడు. కానీ, ట్రంప్ సర్కారు అవేవీ పట్టించుకోకుండా అతడిని భారత్‌కు అప్పగించింది. ఈ ఏడాది జనవరి 21న అతడి న్యాయవాది జాన్ డి క్లైన్ అమెరికా విదేశాంగశాఖకు ఓ లేఖరాశాడు. భారత్‌లో తహవ్వుర్ రాణాను చిత్రహింసలు పెడతారని.. అతడికి 30 రకాల ఆరోగ్య సమస్యలున్నాయని పేర్కొన్నాడు. ఇండియా జైళ్లలోనే అతడు చనిపోయే అవకాశం ఉందని వెల్లడించాడు.
“మరణశిక్షను ఎదుర్కోవడం కోసం భారత్‌కు అప్పగిస్తే షాకింగ్ పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అతడు తీవ్రమైన టార్చర్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఓ పాకిస్థానీ కావడమే అందుకు కారణం. దీనికి తోడు భారత చరిత్రలోనే అత్యంత దారుణమైన ఉగ్రదాడితో అతడి పేరును ముడిపెట్టడం కూడా ఒకటి. కొన్నేళ్లుగా రాణా ఆరోగ్యం క్షీణిస్తోంది. గత ఐదేళ్ల నుంచి పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. లాస్ ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటిన్ కారాగారంలో ఉన్నాడు. అతడికి పార్కిన్సన్ వ్యాధి ఉన్నట్లు 2024లో గుర్తించారు. ఇక జ్ఞాపకశక్తికి సంబంధించిన సమస్యలతో కూడా బాధపడుతున్నాడు. మూత్ర సంబంధ సమస్యలున్నాయి. అతడి బ్లాడర్‌లో పెరుగుతున్న కండరం క్యాన్సర్ అనే అనుమానం ఉంది” అని పేర్కొన్నాడు. వీటితోపాటు కిడ్నీ సమస్యలు, టీబీ, సైనస్, బ్రాంకోటైస్, ఆస్థమా, థైరాయిడ్ సమస్యలు, వినికిడి సమస్యలు ఇలా పలు రకాలు ఉన్నట్లు చెప్పాడు. దీంతోపాటు భారత జైళ్లలో పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంటుందని పేర్కొన్నాడు. రాణా మొత్తం 33 ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వెల్లడించాడు.

### అమెరికా విదేశాంగశాఖ ఏమందంటే..?

రాణా లాయర్ లేఖకు అమెరికా విదేశాంగశాఖ నాడు స్పందించింది. అతడిని కచ్చితంగా భారత్‌కు అప్పగిస్తామని దానిలో తేల్చిచెప్పింది. రాణా లాయర్ లేఖను విదేశాంగ మంత్రి మార్కో రూబియో కార్యాలయం కొట్టిపారేసింది. భారత్ అంతర్జాతీయ చట్టాలను పాటిస్తుందని, జైళ్లలో చిత్ర హింసల నిరోధానికి ఐరాస చట్టంపై సంతకం చేసిందని వెల్లడించింది. వారెంట్ ప్రకారం రాణాను ఎప్పుడైనా భారత్‌కు అప్పగించవచ్చని.. అతడికి సంబంధించిన వైద్యసమాచారం వేగంగా అందించాలని సూచించింది.
గత వారం రాణాను జాతీయ దర్యాప్తు సంస్థ బృందం భారత్‌కు తీసుకొచ్చింది. అతడిని 18 రోజుల కస్టడీకి అప్పజెపుతూ న్యాయస్థానం తీర్పును ఇచ్చింది. దీంతో ఎన్ఐఏ అతడిని విచారించడం మొదలుపెట్టింది. ముంబయి దాడులకు సూత్రధారులను గుర్తించే పనిని మొదలుపెట్టింది. ముఖ్యంగా ఈ దాడుల్లో ఇలియాస్ కశ్మీరీ, అబ్దుర్ రెహ్మాన్, జకీయూర్ రెహ్మాన్ లఖ్వీ పాత్రలపై సమాచారం సేకరించనున్నారు.

# కాలయాపన ఇంకెన్నాళ్లు?..

## టన్నెల్‌లో చిక్కుకున్న ఆరుగురి పరిస్థితేంటి?: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి
ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యల్లో పురోగతి లేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు.
హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యల్లో పురోగతి లేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈమేరకు ఆయన ‘ఎక్స్’లో పోస్టు చేశారు. ప్రమాదం జరిగి 50 రోజులైనా ప్రభుత్వ నిర్లక్ష్యం బాధాకరమని.. టన్నెల్ వద్ద కుటుంబ సభ్యుల ఆవేదన అరణ్య రోదనగా మిగిలిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం 8 మంది కుటుంబాల్లో విషాదం నింపిందని చెప్పారు. బాధితులను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.
“కాంగ్రెస్ నాయకులు పబ్లిసిటీ కోసం టన్నెల్ వద్దకు వెళ్లి రావడం తప్ప ఇప్పటి వరకు చేసిందేం లేదు. ఒకసారి సమీక్ష చేయడం తప్ప చిత్తశుద్ధితో పరిష్కార మార్గం కోసం ప్రయత్నించింది లేదు. సహాయక బృందాలను సమన్వయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర ఆలస్యం జరిగింది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి చరిత్రలో నిలిచిపోయే అప్రతిష్ఠ. ఇంకెన్ని రోజులు కాలయాపన చేస్తారు? లోపల చిక్కుకున్న ఆరుగురి పరిస్థితేంటి? కూటి కోసం, కూలీ కోసం తెలంగాణకు వచ్చి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు అండగా నిలవాలి. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలి. వాస్తవాలను రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టాలి” అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## రేవంత్ లాంటి మోసగాడిని నమ్మినందుకు

# తెలంగాణ ఆగమైంది : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి


రేవంత్ రెడ్డి చెప్పిన అవాస్తవ వాగ్దానాలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అసంబద్ధ హామీల వలన ప్రజల జీవితాలు సంక్షోభంలో పడినట్లు పేర్కొన్నారు. “ఒక్కసారి మోసపోతే అది మోసగాడి తప్పు, కానీ పదేపదే మోసపోతే అది మన తప్పవుతుంది. కాబట్టి ఈసారి ఎలాంటి ఎన్నిక వచ్చినా కాంగ్రెస్‌ను తిప్పికొట్టాలి” అని ప్రజలను హెచ్చరించారు.
జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పండి. “ఒకే తప్పును మళ్లీ చేయొద్దు. జీహెచ్ఎంసీతో పాటు రానున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్‌ను తిరస్కరించండి” అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రం మొత్తం దారుణంగా వెనుకబడుతున్నా, ఒక్క రేవంత్ రెడ్డియే ఆనందంగా ఉన్నట్టు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. “రేవంత్ పాలన వలన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలే అసంతృప్తిగా ఉన్నారు. ఇక ప్రజల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఇది వాళ్ల విఫల పాలన ఫలితమే” అని అన్నారు.
మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ప్రజల మధ్య తిరుగుతూ సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తారని కేటీఆర్ ప్రశంసించారు. “డంపింగ్ యార్డ్ వంటి కీలక సమస్యలపై పోరాడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంచి నాయకుడిని గెలిపిస్తే, మంచి మార్పు సాధ్యమవుతుందని ఆయన నిరూపించారన్నారు.
కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉంది..
ఎన్నిక ఏదైనా, సందర్భం ఏదైనా - ఈసారి ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఆత్మ, తెలంగాణ స్వభిమానం కాపాడాలంటే, భరోసా నలుగురికీ కలిగించగల పార్టీ ఒక్కటే ఉంది -అది బీఆర్ఎస్ అని కేటీఆర్ పేర్కొన్నారు. సిల్వర్ జూబ్లీ ఉత్సవాల విజయవంతానికి కేటీఆర్ పిలుపునిచ్చారు. “ఈ నెల 27న పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం. ఒక పార్టీగా 25 సంవత్సరాల ప్రయాణం ఎలాంటి మైలురాయో ప్రతి కార్యకర్తకు అర్థమవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇది రెండవ ఘనత సాధించిన పార్టీగా మన గర్వం” అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ సభకు ముందు భారీ ర్యాలీ నిర్వహించి కార్యకర్తలు స్వాగతం పలికారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నేతలు కేటీఆర్ సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరారు.

# మార్క్ శంకర్‌తో

## కలిసి హైదరాబాద్ చేరుకున్న పవన్‌కల్యాణ్

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ చేరుకున్నారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పవన్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ గాయపడి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకుంటున్న సంగతి తెలిసిందే. శనివారం రాత్రి పవన్ తన సతీమణి అన్నాలెజినోవా, కుమారుడు మార్క్‌శంకర్, కుమార్తె పొలెనా అంజనా పవనోవాతో కలిసి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. తన కుమారుడిని పవన్ ఎత్తుకుని ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

### ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు: పవన్

మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తూ తాజాగా పవన్ కల్యాణ్ ‘ఎక్స్’ వేదికగా పోస్ట్ పెట్టారు. బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని.. కోలుకుంటున్నాడని పేర్కొన్నారు. ప్రమాదం గురించి తెలిసి మార్క్ శంకర్ క్షేమాన్ని ఆకాంక్షించిన రాజకీయ నాయకులు, జనసేన నేతలు, అభిమానులు, కుటుంబసభ్యులు, స్నేహితులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. క్లిష్ట సమయంలో వారి సందేశాలు, ప్రార్థనలు తమ కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయన్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీకి పవన్ కృతజ్ఞతలు చెప్పారు. సింగపూర్ అధికారులు, సింగపూర్‌లోని భారత హైకమిషన్ అధికారులు సమన్వయంతో అందించిన సాయం క్లిష్ట సమయంలో ఎంతో భరోసా ఇచ్చిందన్నారు.

# బిల్డర్ల సమస్యలు

## పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం

మొదటిపేజీ తరువాయి
పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.
“హైదరాబాద్ అభివృద్ధికి బిల్డర్లు కృషి చేయాలి. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్‌రోడ్డు, కృష్ణా-గోదావరి జలాల తరలింపు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అయ్యాయి. ఈ అభివృద్ధిని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకుపోతుంది. ప్రజారవాణా కోసం మెట్రోను అభివృద్ధి చేస్తున్నాం. హైదరాబాద్‌ను మరో సిలికాన్ వ్యాలీగా తీర్చిదిద్దుతాం. పెట్టుబడులకు అనుకూలంగా ఫ్యూచర్ సిటీని తీసుకొస్తున్నాం. మూసీ ప్రక్షాళన చేపట్టి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం. సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్‌కు మేం మరింత భరోసా ఇస్తున్నాం. మరింత లాభాలు వచ్చేలా అభివృద్ధి చేస్తాం. పెట్టుబడులు వస్తున్నాయి.. మరిన్ని భవనాలు నిర్మించండి. ప్రభుత్వంలో బిల్డర్స్ ఎప్పటికీ భాగస్వాములుగానే ఉంటారు. ప్రభుత్వ అభివృద్ధిలో మీ పాత్ర ఎప్పటికీ ఉంటుంది. ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుంది” అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

# టీజీపీఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు: రాకేష్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: పూర్తి ఆధారాలతో గ్రూప్-1 అవకతవకలు బయటపెట్టామని, టీజీపీఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తేలేదని భారాస నేత రాకేష్ రెడ్డి అన్నారు. అవకతవకలపై ప్రశ్నలకు టీజీపీఎస్సీ సమాధానాలు చెప్పట్లేదని, నోటీసులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ అభ్యర్థులకు జవాబివ్వడంలో చూపాలని విమర్శించారు.
“టాప్ 500లో ఒక్క తెలుగు మీడియం అభ్యర్థి కూడా ఎందుకు లేదు? ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు ఎందుకిచ్చారు?మహిళ, పురుషులకు వేర్వేరు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేశారు? మొత్తం 46 సెంటర్లుంటే 2, 3 సెంటర్ల నుంచే టాపర్స్ ఎందుకు వచ్చారు?రిటైర్డ్, కాంట్రాక్టు లెక్చరర్లతో గ్రూప్-1 పేపర్లు దిద్దిస్తారా?గ్రూప్-1 అవకతవకలపై పోరాటం కొనసాగిస్తాం. దీనిపై న్యాయ విచారణ జరిపిస్తే.. అన్ని ఆధారాలు చూపిస్తాం. నేనే టీజీపీఎస్సీపై పరువు నష్టం దావా వేయబోతున్నా” అని రాకేశ్‌రెడ్డి తెలిపారు.

## ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి మృతి.. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం వల్లేనంటూ వాహనదారుల ఆందోళన

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్, కూకట్‌పల్లి: నగరంలోని బాలానగర్‌లో ఆర్టీసీ బస్సు కింద పడి ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు బైక్‌ను ఆపేందుకు యత్నించారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పడంతో వాహనదారుడు కిందపడ్డాడు. అదే సమయంలో వచ్చిన ఆర్టీసీ బస్సు అతడి తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం వల్లే వ్యక్తి మృతిచెందాడంటూ వాహనదారులు ఆందోళనకు దిగారు. దీంతో జీడిమెట్ల నుంచి బాలానగర్ మార్గంలో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. వాగ్వాదానికి దిగిన వారిని పోలీసులు చెదరగొట్టారు.

## రెండురోజులు ఈ జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు.. ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..

మొదటిపేజీ తరువాయి
తెలంగాణలో మరో రెండురోజులు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఆగ్నేయ మధ్యప్రదేశ్, పరిసర ప్రాంతాల్లో విదర్భ మీదుగా తెలంగాణ మధ్య ప్రాంతాల వరకు ఉపరితల ఆవర్తనం నుంచి ద్రోణి సగటున సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతుందని పేర్కొంది. కోస్తాంధ్ర, యానాం, మధ్య ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతోందని చెప్పింది. ఈ క్రమంలో తెలంగాణలో రాబోయే రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, పలుచోట్ల ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలకు పెరుగుతాయని పేర్కొంది.
ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మరో వైపు ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. సోమవారం కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో వడగాలులు వీస్తాయని.. ములుగు, కొత్తగూడెం, ఖమ్మంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని వివరించింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

# రాజ్యాంగం పేరుతో తప్పుడు తీర్మానాలు

# భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- భారత రాజ్యాంగం ఆట వస్తువు కాదు
- పార్లమెంట్ సాక్షిగా గతంలో జరిగిన ద్రోహం సరిచేయాల్సిందే

ప్రత్యేక వ్యాసం

ఈమధ్య రాజ్యాంగ పుస్తకము చేతిలో పట్టుకొని జై సంవిధాన్ అంటూ శ్రీ రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని ఒక ప్రదర్శన వస్తువుగా మార్చారు. 1947 సంవత్సరంలో మన భారతదేశం స్వాతంత్రం పొందిన తర్వాత మన దేశానికి ఒక పాలన వ్యవస్థ గానీ, రాజ్యాంగ దర్శనం గానీ లేదు.

దేశంలోని మేధావులు, ప్రముఖులు కలిసి రాజ్యాంగ రచనా కమిటీ వేసి స్వర్గీయ డాక్టర్ అంబేద్కర్ గారి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రచనకు పూనుకున్నారు.

1950 సంవత్సరంలో మన రాజ్యాంగ రూపకల్పన జరిగిన తర్వాత ప్రజలు మనది సర్వసత్తాక గణతంత్ర రాజ్యం అని మురిసిపోయి మరచిపోయి పడుకున్నారు.

మన భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పటికీ తమ ఎజెండా ఇంకా పూర్తి కాలేదని కొన్ని శక్తులు దేశంలో రహస్యంగా ప్రణాళికలు రచిస్తూ వచ్చాయి.

## ● అందులో మొదటిది సెంట్రల్ వక్ఫ్ బోర్డ్ యాక్ట్

1954 సంవత్సరంలో భారత పార్లమెంటు తీర్మానం ద్వారా వక్ఫ్ బోర్డ్ ఏర్పాటు జరిగింది. తరువాత చాలాసార్లు మన భారత పార్లమెంట్ లో వక్ఫ్ బోర్డ్ కు సవరణలు జరిగాయి.

అందులో ముఖ్యంగా 1995, 2013 సంవత్సరంలో జరిగిన సవరణలు వక్ఫ్ బోర్డ్ కు రాజ్యాంగానికి అతీతమైన హక్కులు కల్పించాయి.మన రాజ్యాంగం నీడలో రూపొందిన ఇంకొక చట్టం పార్లమెంటులో తీర్మానం ద్వారా రూపుదిద్దుకున్నది.

## ● అది ప్రార్థన స్థలాల చట్టం

1991 సంవత్సరంలో రూపొందిన ద ప్లేసెస్ ఆఫ్ వర్షిప్ యాక్ట్ మరియు వక్ఫ్ యాక్ట్ రెండు కూడా పార్లమెంట్ ద్వారా రూపొందించబడినవే.

## ● ఈ రెండు పార్లమెంటు తీర్మానాలు భారత రాజ్యాంగాన్ని అవహేళన చేసేవే

ప్రార్థన స్థలాల చట్టం ప్రకారము ఒక మతానికి చెందిన స్థలం, ఇంకొక మత ప్రమేయంతో ఎలాంటి మార్పు చేర్పులకు గురి కాకూడదు. ఆ మతానికి చెందిన స్థలము ఆస్తులు కేవలము వారి ఆధీనంలో ఆజమాయిషీలో కొనసాగాల్సిందే.ఈ చట్టం రూపొందించక ముందు ఏదేని ప్రార్థన స్థలము లేదా ఆ మతానికి చెందిన ఆస్తి గనుక గతంలో రూపు మార్చబడి ఉంటే కూడా అది చెల్లదు.ఈ ప్రార్థన స్థలాల చట్టం, స్పష్టంగా తమ మత స్థలాల యధాత స్థితి కొనసాగించుకొనే వీలు కలిగించింది.తమ మత ఆచారాలు వ్యవహారాలు నడుపుకోవడానికి సంపూర్ణమైన రాజ్యాంగ రక్షణ కల్పించింది ఈ చట్టం.మన రాజ్యాంగం ద్వారా ఈ తీర్మానాల ద్వారా రూపొందిన చట్టాలు ప్రతి మతానికి స్పష్టమైన రక్షణ కల్పించింది.

## ● మరి వక్ఫ్ చట్టం ఏమంటున్నది?

యు పి ఏ ప్రభుత్వం పాలిస్తున్న 2013 సంవత్సరంలో భారత పార్లమెంటు ద్వారా వక్ఫ్ చట్టానికి కోరలు తొడిగారు.పార్లమెంటు సవరణ ద్వారా వక్ఫ్ చట్టానికి అపరిమితమైన, ప్రశ్నించ వీలులేని, ఏ కోర్టులో, ఏ ప్రభుత్వ శాఖలో సవాలు చేయలేని ఒక రాజ్యాంగ వ్యతిరేక విలువలతో ఈ సవరణ చేయడం జరిగింది.ఈ సవరణ ద్వారా వక్ఫ్ బోర్డు ఏ స్థలాన్ని అయినా, ఎక్కడి స్థలాన్ని అయినా, ఏ ఆస్తి నైనా నిరభ్యంతరంగా నిస్సందేహంగా కబ్జా చేసే అధికారాన్ని పార్లమెంట్ ద్వారా సంక్రమింప చేశారు.ప్రార్థనా స్థలాల చట్టం తమ మత ఆస్తులకు రక్షణ కల్పిస్తే, వక్ఫ్ బోర్డ్ చట్టం ఏ మతానికి చెందిన ఆస్తినైనా కబ్జా చేసుకోమంటున్నది.రాజ్యాంగాన్ని మిక్సీలో వేసి తిప్పి తయారు చేసిన ఈ రెండు పరస్పర విరుద్ధ రాజ్యాంగ తీర్మానాలు అర్థం కాక సుప్రీం కోర్ట్ కూడా మోకాళ్ళ మీద చేయి వేసుకుని,నోరు మూసుకున్నది.

## ● ఈ బ్రహ్మ పదార్థం లాంటి రాజ్యాంగ ఆటలను చూస్తూ సెక్యులరిస్టులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రగతిశీల వాదులు, రాజకీయ పార్టీలు, ప్రసార సాధనాలు మన్ను తిన్న పాములా పడి ఉండడం ఆశ్చర్యాన్ని గొలిపే అంశము

బ్రిటిష్ పాలకుల సలహాదారుడు లార్డ్ మెకాలే మంత్రానికి ఆదపరిచిన భారత ఆలోచన స్తబ్దుగా మారిపోవడం ఒక వింత.మన దేశ స్వాభిమానాన్ని, సంస్కృతిని, ఆచార వ్యవహారాలను, నాగరికతను కించపరచడమే మేధస్సు గా భావించే ఒక లుటియన్ వర్గము మనదేశంలో తయారయింది.దీనికి ప్రధాన కారణము కమ్యూనిజం, విదేశీ భావదస్యంలో మగ్గిపోయిన కాంగ్రెస్, బ్రిటిష్ పాలకుల ద్వారా ప్రోత్సహించబడి పోషించబడిన క్రైస్తవ మతము,మన దేశంపై దండెత్తి అంతులేని హింసను అరాచకాన్ని సాగించిన ఇస్లాం మతం. ఈ మాయలో పడ్డ మీడియా కూడా ఈ అరాచకాలకు వంత పాడుతూ నిద్రలో జోగుతూ వచ్చింది.

## ● భారత రాజ్యాంగాన్ని ఒక మట్టి ముద్దగా మార్చి తమకు ఇష్టం వచ్చిన రీతిలో పాత్రలు తయారుచేసి, ఇదే రాజ్యాంగం, నా చేతిలో ఉన్న ఈ మట్టి పాత్ర మాత్రమే రాజ్యాంగం అంటూ ఊదరగొడుతుంటే ఆదమరిచిన ప్రజలు అమాయకులు పాలకులను నమ్ముతూ వచ్చారు




## ● ఎవరు రాజ్యాంగ ద్రోహులు?

1947 స్వాతంత్రం తరువాత రాజ్యాంగం పేరుతో ఆడిన నాటకాలు అర్థం చేసుకునే స్థితిలో లేని మన భారత మేధస్సు పక్షవాతంతో పక్షపాతంతో దేశ నవ నాడులను దెబ్బతీసింది.

1947 స్వాతంత్రం తరువాత మన దేశాన్ని కేవలం కాంగ్రెస్ భావజాలం మాత్రమే పాలించింది.

కాంగ్రెస్ లో పనిచేసి విడిపోయిన నాయకులు సొంత పార్టీలు పెట్టుకొని, కాంగ్రెస్ కు ప్రతిరూపంగా మారిపోయారు.

సెక్యులర్ అని చెప్పుకోవడం మాత్రమే రాజకీయం అనే భ్రమలో ఈ పార్టీలు కాలం వెళ్లదీస్తూ వచ్చాయి.

పంజాబ్ మహారాష్ట్ర తమిళనాడు కేరళ కర్ణాటక పశ్చిమ బెంగాల్ బీహార్ ఉత్తర ప్రదేశ్ ఇంకా కొన్ని రాష్ట్రాల్లో తలెత్తిన ప్రాంతీయ పార్టీలు అన్నీ కూడా కాంగ్రెస్ సెక్యులర్ ధోరణి మాత్రమే అనుసరించాయి.

ఈ పార్టీలకు వేటికి కూడా మన దేశ అంతరాత్మ ఆవేదన ఆక్రోషం అర్థం కాలేదు. ఈ మధ్యలో ఏర్పడిన అటల్ బిహారీ వాజ్ పాయ్ ప్రభుత్వం కొనసాగకుండా జాతీయ అంతర్జాతీయ శక్తులు చేసిన కుట్రలు చేదించుకుంటూ, మన జాతి అస్మిత బలపడుతూ వచ్చింది.అలుపెరుగని జాతీయవాదం నిరంతర పోరాటం చేస్తూ, మన జాతి పునర్నిర్మాణానికి కృషి చేస్తూ వచ్చింది.2014 సంవత్సరంలో శ్రీ నరేంద్ర మోడీ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం ఈ రాజ్యాంగ రక్షణ బాధ్యతను ఒడుపుగా కొనసాగిస్తున్నది.ఒక దానికి ఒకటి పొంతన లేని చట్టాలు వందలాదిగా మోడీ ప్రభుత్వం రద్దు చేసింది.ప్రార్థన స్థలాల చట్టము ఒకరి స్థలాన్ని ఇంకొకరు ఆక్రమించకుండా పార్లమెంట్ ద్వారా రూపొందిస్తే, అదే పార్లమెంటులో వక్ఫ్ బోర్డుకి ఏ ఆస్తినైనా ఏ స్థలాన్ని అయినా కబ్జా చేసే రాజ్యాంగ వ్యతిరేక హక్కులు కల్పించింది.అది ప్రైవేటు ఆస్తి అయినా ప్రభుత్వ ఆస్తి అయిన బస్సులో కర్చీఫ్ వేసి సీటు నాది అని అనగలిగే అంత సులువైన మార్గాన్ని వక్ఫ్ బోర్డుకు కట్టబెట్టిన తీరు జనానికి అర్థమైంది. ఇస్లాం మతం పుట్టి 1400 సంవత్సరాలు అవుతున్నది.తమిళనాడు తిరుచిరాపల్లి జిల్లా తిరుచందూర్ అనే ఊరిలో 1500 సంవత్సరాల క్రితం నిర్మించిన హిందూ దేవాలయము, ఆ ఊరిలోని మొత్తం భూమి, ఆ జిల్లాలో ఉన్న 18 గ్రామాలు మొత్తం వక్ఫ్ ఆస్తులని సింపుల్ గ ఒక ఉత్తరం ద్వారా ప్రభుత్వాన్ని ఆదేశించే స్థాయికి, అది చూస్తూ ఏమీ చెయ్యలేని ప్రజాస్వామ్యం చట్టు బండగా మారిన వింత పరిస్థితిని మనము అనుభవించాము.

ఇస్లాం పుట్టక ముందు కట్టిన హిందూ మందిరాలు వక్ఫ్ ఎలా చెందుతాయి? అని బహిరంగంగా ప్రశ్నించలేని సెక్యులర్ పార్టీలు,నాయకుల బలహీన రూపం ప్రజలకు తెలిసి వచ్చింది.

కేవలం తమిళనాడు మాత్రమే కాదు కేరళలోని మనంబం గ్రామం లోని క్రైస్తవుల ఇల్లు జాగలన్నీ మావేనని వక్ఫ్ బోర్డు పట్టపగలే ఆక్రమిస్తే ఏమీ చెయ్యలేని స్థితికి నెట్టివేసింది మన ఈ రాజ్యాంగం.

సామాన్యులకు వారి హక్కుల రక్షణ కల్పించలేని ఈ రాజ్యాంగం చట్టాలపై నిరసన చెలరేగే అవకాశాన్ని కల్పించింది ఈ సెక్యులర్ పార్టీలు,నాయకులు మాత్రమే.

కేరళ మాత్రమే కాదు, ఉత్తరప్రదేశ్ బీహార్ ఉత్తరాఖండ్ హిమాచల్ అస్సాం పశ్చిమబెంగాల్ పంజాబ్ హర్యానా తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలే కాదు దేశంలోని ప్రతి చోటా వక్ఫ్ బోర్డు సామ్రాజ్యవాద మత శక్తి విశృంఖలంగా భూములు స్థలాలను ఆక్రమిస్తూ దేశ సెక్యులర్ రీతిని అపహాస్యం చేస్తుంటే ప్రజాస్వామ్య ప్రగతిశీల వాదులు పక్షపాతంతో, పక్షవాతం సోకి నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుంటే ప్రజలు తిరగబడుతున్నారు.

## ● పూజ్యుడు అంబేద్కర్ మహాశయుడు రాసింది సెక్యులర్ రాజ్యాంగం కాదా?

ఒక మతానికి చెందిన ఆస్తులు ప్రార్థన స్థలాలు ఇలా ఇస్లాం మతానికి చెందుతుంటే, రాజ్యాంగం ఈ చట్టాలు, కోర్టులు ఏమి చేయలేవా? ప్రార్థన స్థలాల చట్టము, వక్ఫ్ బోర్డు చట్టము రెండు కూడా భారత రాజ్యాంగ పరిధిలో రూపొందించబడినవే. భారత రాజ్యాంగ స్ఫూర్తిని హత్య చేసినవే.రాజ్యాంగాన్ని హత్య చేసిన వారు మళ్లీ అదే రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకొని జై సంవిధాన్ అంటూ తిరుగుతుంటే మెల్లమెల్లగా రాజ్యాంగ లోతులు,రాజకీయ మర్మం ప్రజలకు అర్థమవుతున్నాయి.అంబేద్కర్ కేవలము ఒక విగ్రహం కాదు. రాజ్యాంగం కేవలం పుస్తకం కాదు.దేశం అనే శరీరానికి రాజ్యాంగం ఆత్మ.అంబేద్కర్ అందించిన రాజ్యాంగంలో అన్ని సమస్యలకు పరిష్కారాలున్నాయి.మహనీయుడు అంబేద్కర్ తన రక్త మాంసాలు కరిగించి రూపొందించిన భారత రాజ్యాంగం స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిది.మన ప్రజాస్వామ్యం ఒక ముతాస్వామ్యంగా మారిపోవడం సహించరానిది.కర్ర ఉన్న వాడిదే గొర్రె అనే పద్ధతిలో వీధుల్లోకి వచ్చి అల్లరి చేస్తామని హత్యలు చేస్తామని మా మత హక్కులకు, మా విచ్చలవిడితనానికి భంగం కలిగిస్తే రక్తపాతం సృష్టిస్తామనే శక్తులు కచ్చితంగా రాజ్యాంగ వ్యతిరేక శక్తులే. మూక బలంతో జులుం చెలాయిస్తామంటే కుదరదు.ఏ పార్లమెంటు ద్వారా ప్రార్థన స్థలాల చట్టం, వక్ఫ్ బోర్డు చట్టం రూపొందాయో, గతంలో సవరించబడ్డాయో, ఇప్పుడు కూడా అదే పార్లమెంటు ద్వారా మరొక్క సవరణ జరిగింది.జాయింట్ పార్లమెంటు కమిటీ ద్వారా, పార్లమెంటు లోపల బయట విస్తృతంగా చర్చ జరిగింది.రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంటులో సవరణ జరిగింది.పార్లమెంట్ తీర్మానాన్ని చట్టాన్ని రాజ్యాంగాన్ని లెక్కచేయం పో అంటే ప్రజలు వారిని దేశం నుండి గెంటేస్తామనడం తప్పేలా అవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యాపిస్తున్నది.భారత పార్లమెంటు ఔన్నత్యాన్ని దెబ్బతీసే ఏ ప్రకటన అయినా, ఏ ప్రదర్శన అయినా రాజ్యాంగ వ్యతిరేకం, దేశ వ్యతిరేకం.హింస ద్వారా, ఆయుధం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసి మతరాజ్యం స్థాపిస్తామనుకున్న శక్తులను అణచివేసే అపరిమిత అధికారం కూడా రాజ్యాంగం మనకు కల్పించింది.ప్రపంచంలోనే ఉన్నతోన్నతమైన భారత రాజ్యాంగాన్ని అందించిన దివంగత డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ గారి దివ్యచరణాలకు ప్రణమిల్లుతూ వారి ఒక 135వ జయంతి జయంతి రోజున ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ఈ రోజు రాజ్యాంగ రక్షణకు కట్టుబడి ఉండే రోజు.రాజ్యాంగ స్ఫూర్తిని రక్షించే భాధ్యత మనందరిదీ.రాజ్యాంగం అమలుచేయాల్సిన నాయకుల స్వచ్ఛమైన వ్యక్తిత్వం మాత్రమే మన రాజ్యాంగాన్ని కాపాడుతుంది.

- పార్లమెంట్ మన దేవాలయం
- భారత రాజ్యాంగం మన దేవుడు

# 1995-1996 ఎస్ ఎస్ సి పూర్వ విద్యార్థుల, ఆత్మీయ సమ్మేళనం..

**కరపత్రం ప్రతినిధి వీణవంక ఏప్రిల్ 13**

వీణవంక మండల చల్లూర్ జడ్పీ ఎస్ ఎస్ పాఠశాలలో చదివిన 1995-1996 సంవత్సరంలో ఎస్ఎస్సి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ, ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలవేసి, శాలువా కప్పి విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు ఆనాటి తీపి జ్ఞాపకాలను, గురువులు నేర్పిన క్రమశిక్షణను గుర్తుతెచ్చుకొని, స్నేహితులతో పంచుకున్నారు. విద్యార్థి దశలో ఉపాధ్యాయుడు తన జ్ఞానాన్ని పంచడంతోనే, మనం ఈరోజు ఇంతటి విజ్ఞాన వంతులమయ్యామని,ఆనాటి గురువులకు పాదాభివందనాలు అంటూ, గురువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పూర్వ విద్యార్థులు తమ జీవితంలో జరిగిన సంఘటనలను స్నేహితులతో పంచుకున్నారు. కష్టసుఖాలలో సహాయపడేవారు స్నేహితులని కొనియాడారు. అనంతరం సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులు మధన్ మోహన్ రావు, రాజి రెడ్డి, రామ్ కుమార్, సుధాకర్ ,కాశి విశ్వనాథ్, వెంకటేశ్వర్లు, శాంత కుమార్ సింగ్,పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ త్రింగేశ్వర స్వామి దేవస్థానంలో రుద్రాభిషేకం



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

పెద్దపెల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని జనగామ మండలంలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన శ్రీ త్రింగేశ్వర స్వామి దేవస్థానంలో రుద్రాభిషేకం పురస్కరించుకుని పర్వదినాన శ్రీ త్రింగేశ్వర స్వామి వారికి రుద్రాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తన కుటుంబ సభ్యులతో సహా మంథని శాసనసభ్యులు, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తమ్ముడు శీను బాబు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, స్వామివారి దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకుంటున్నానని, ప్రజల సంక్షేమమే మా ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అంతేగాక, నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, ప్రతి ఒక్కరి సహకారంతో రామగుండం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దతామని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఖనిలో శ్రీపాద రావు వర్ధంతి కార్యక్రమాలు

**- బస్టాండ్ వద్ద అన్నదానం**



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

గోదావరిఖని బస్టాండ్ ఎదుట అజాతశత్రువు, అందరివాడు, మంథని ముద్దుబిడ్డ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ శాసన సభాపతి స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఏం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొని శ్రీపాద రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దుద్దిల్ల శ్రీపాద రావు రాష్ట్ర రాజకీయాలలో అపూర్వ ముద్ర వేసిన మహనీయుడని, ప్రజా సమస్యల పరిష్కారానికి జీవితాన్ని అంకితమిచ్చిన సుపరిచిత నాయకుడు, ఆయన ప్రజాస్వామ్య పరిరక్షణకు చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. మంథని, గోదావరిఖని ప్రజల హృదయాలలో ఆయన అమరుడై ఉన్నారని, ఇటువంటి మహనీయుని స్మరణ మనకు గొప్ప గౌరవం అని పేర్కొన్నారు. వర్ధంతి కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మాలలు సమర్పించి, ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహంకాళి స్వామి, బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఏప్రిల్ 14 2025

## విజ్ఞాన్స్ వీశాట్- 2025 ఫేజ్-1 ఫలితాల విడుదల

**కరపత్రం, గుంటూరు ప్రతినిధి, ఏప్రిల్ 13.**

గుంటూరు జిల్లా చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని దేశ్‌ముఖి సమీపంలో ఉన్న విజ్ఞాన్ క్యాంపస్‌లో బీటెక్, బీ ఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్, ఫార్మాడీ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్– 2025 ఫేజ్–1 పరీక్షా ఫలితాలను వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఉపకులపతి పి.నాగభూషణ్, డైరెక్టర్ అడ్మిషన్స్ అప్పారి గౌరీశంకరరావు, రిజిస్ట్రార్ ఎం.ఎస్.రఘునాథన్, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ కృష్ణకిషోర్ శనివారం విడుదల చేశారు. ఈ నెల 16 నుంచి 20 వరకు వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, హైదరాబాద్ క్యాంపస్‌లలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ https://vignan.ac.in/vsatresult/లో తెలుసుకోవచ్చని తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు 25 శాతం సీట్లు కేటాయించాలి

– విద్యా కమిషన్ ఛైర్మన్‌కు మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి లేఖ

**కరపత్రం, జగిత్యాల ప్రతినిధి, ఏప్రిల్ 13.**



విద్యాహక్కు చట్టం నిబంధనలను అనుసరించి తెలంగాణలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు 25 శాతం సీట్లు ప్రత్యేకంగా కేటాయించి అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఆయా వర్గాల పిల్లలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులకు పరిమితం అవుతూ విద్యాబోధన చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఆయన శనివారం రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి లేఖ రాశారు. 'భారత రాజ్యాంగంలో నిర్దేశించిన ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో బీసీలకు 25 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10శాతం, మైనారిటీలకు 4 శాతం సీట్లు విధిగా కేటాయిస్తే రిజర్వేషన్ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రెగ్యులరేషన్ కమిటీ నిర్దేశించిన ఫీజు మాత్రమే వసూలు చేయాలి, అదనపు ఫీజులు వసూలు చేయకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాలి. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి' అని జీవన్‌రెడ్డి కోరారు.

## కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం వద్దు!

– తెలంగాణ సారస్వత పరిషత్ డిమాండ్

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**

జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం ప్రవేశపెట్టాలనే నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని తెలంగాణ సారస్వత పరిషత్తు ఇంటర్మీడియట్ విద్యాశాఖను డిమాండ్ చేసింది. ఇప్పటికే కొన్ని దశాబ్దాలుగా విద్యార్థులకు మార్కుల వేటలా సంస్కృతాన్ని అలవాటు చేసిన ప్రభుత్వ విధానం.. ప్రస్తుత నిర్ణయంతో తెలుగుకు మరింత అన్యాయం చేస్తోందని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కనీసం ప్రాథమికస్థాయి వరకైనా మాతృభాషలో విద్యాభ్యాసం తప్పనిసరిగా జరగాలని విద్యావేత్తలు, విద్యా కమిషన్లు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాల స్థాయి వరకు ఎక్కడా బోధించని, జీవితంలో ఎక్కడా ఉపయోగపడని సంస్కృతం ప్రవేశపెడితే తెలుగు రాష్ట్రమైన తెలంగాణ తరతరాల అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. విద్యావ్యవస్థలో తెలుగుకు సముచిత స్థానం కల్పించాలని వారు కోరారు.

## వాట్సప్ సేవల్లో అంతరాయం.. యూజర్ల ఫిర్యాదు

**కరపత్రం, ఇంటర్నెట్ డెస్క్, ఏప్రిల్ 13.**



వాట్సప్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. యూజర్లు మెసేజులు పంపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెటాకు చెందిన ప్రముఖ మెసెంజర్ యాప్ వాట్సప్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. భారత్‌లోని యూజర్లు యాప్‌ను ఉపయోగించడంలో అవాంతరం ఎదుర్కొంటున్నారు. వాట్సప్ సందేశాలు వెళ్లడం లేదని, స్టేటస్‌లు అప్‌లోడ్ కావడం లేదని యూజర్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. 81 శాతం మంది మెసేజులు పంపడంలో ఇబ్బంది ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. వాట్సప్ దీనిపై అధికారికంగా స్పందించలేదు. మెటాకే చెందిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సేవల్లోనూ అంతరాయం ఎదుర్కొంటున్నట్లు పలువురు యూజర్లు పేర్కొంటున్నారు. ఉదయం యూపీఐ సేవల్లో.. సాయంత్రం వాట్సప్ సేవల్లో అంతరాయం ఏర్పడడంపై యూజర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## కాంగ్రెస్ హాయం లోనే అభివృద్ధి పనులు

కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే గ్రామాలలో ఆశించిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆ పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ ఎం. ఆనందం అన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన 10 లక్షల నిధులతో ఆదివారం పరిగి మండలం నస్కల్ గ్రామంలో అంతర్గత సిసి రోడ్డు పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నస్కల్ గ్రామంలో ఎస్సీ కాలనీకి ఇప్పటివరకు సిసి రోడ్డు వేసిన ఆనవాళ్ళు లేవని వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వారమని అన్నారు.పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి సహకారంతో సిసి రోడ్లు వేయిస్తున్నందుకు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేసినారు.ఈ కార్యక్రమంలో ఎం.అంజయ్య, ఎం చంద్రయ్య , కొండ గోవర్ధన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతికీ గడువు

- 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలి
- లేదంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు
- తమిళనాడు వివాదంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు
- గవర్నర్ల నిష్క్రియపైనా న్యాయ సమీక్ష...
- ఆ అధికారం తమకుందన్న ధర్మాసనం



**కరపత్రం, ఢిల్లీ ప్రతినిధి,ఏప్రిల్ 13.**

శాసనసభలు ఒకటికి రెండు సార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు కారణాలనూ జత చేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ నెల 8న సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. 415 పేజీల ఆ తీర్పులోని పూర్తి వివరాలు శుక్రవారం రాత్రి సుప్రీంకోర్టు వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి వచ్చాయి.

### తీర్పులోని ముఖ్యమైన అంశాలు

కేసు విచారణ సందర్భంగా కేంద్ర హోంశాఖ సూచించిన 3 నెలల వ్యవధిని.. పరిశీలన నిమిత్తం గవర్నర్లు పంపించిన రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి గడువుగా విధించడం సముచితమని భావించినట్లు ధర్మాసనం తెలిపింది.బిల్లుల ఆమోదానికి ఈ కాల వ్యవధిని మించి జాప్యం జరిగితే అందుకు గల కారణాలను నమోదు చేయాలి.రాష్ట్రపతి పరిశీలన కోసమంటూ బిల్లును గవర్నరు రిజర్వులో ఉంచడం, రాష్ట్రపతి కూడా సమ్మతి తెలపకుండా తన వద్దే నిలిపివేయడం వంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం నిస్సంకోచంగా సుప్రీంకోర్టులో సవాల్ చేయవచ్చు.బిల్లులకు ఆమోదం తెలిపే, తిరస్కరించే, రాష్ట్రపతికి పంపించే అధికారాన్ని గవర్నర్లకు రాజ్యాంగ అధికరణం 200 కల్పించింది. దాని అర్థం బిల్లులపై ఎప్పటికీ నిర్ణయం తీసుకోకుండా ఉండమని కాదు. రాష్ట్రాల్లో శాసన నిర్మాణ వ్యవస్థను స్తంభింపజేయమనీ కాదు. అకారణంగా బిల్లులను సుదీర్ఘకాలం నిలిపి ఉంచడం సరికాదని పంజాబ్ రాష్ట్రం కేసులో సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసింది.మంత్రి మండలి సిఫార్సులను ఆమోదించడం రాష్ట్ర గవర్నర్ విధి. రెండోసారి కూడా ఆమోదించి పంపిన బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసమని నిలిపి ఉంచడం లేదా నివేదించడం భావ్యం కాదు.

ప్రస్తుతం నిర్దేశించిన కాలవ్యవధిలోగా బిల్లులపై ఎటువంటి నిర్ణయం తీసుకోని గవర్నర్ల నిష్క్రియాపరత్వంపైనా న్యాయసమీక్ష అధికారం కోర్టులకు ఉంటుంది.మంత్రి మండలి సిఫార్సుకు భిన్నంగా బిల్లుకు గవర్నర్ సమ్మతిని నిలిపివేస్తే ఆ బిల్లును 3 నెలల్లోగా తిప్పి పంపించాలి. అందుకు కారణాన్ని తెలపాలి.మంత్రి మండలి సిఫార్సును కాదని బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపించాలని గవర్నర్ భావిస్తే...మూడు నెలలులోగా ఆ పని చేయాలి.రాష్ట్ర శాసనసభ రెండోసారి ఆమోదించి పంపించినట్లయితే ఆ బిల్లుకు గవర్నర్ వెంటనే ఆమోదం తెలపాలి. గరిష్ఠంగా నెలకు మించి సమయం తీసుకోరాదు. అటువంటి బిల్లులను పూర్తిగా నిలిపివేయడం, లేదా తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదు. రాజ్యాంగ అధికరణం 201 ప్రకారం...రాష్ట్రపతికి కూడా అటువంటి బిల్లులను తిరస్కరించే అధికారం లేదు.

### ఇది చరిత్రాత్మకం: కపిల్ సిబల్

రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు చర్య తీసుకోవడానికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడాన్ని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ సమర్థించారు. సమాఖ్య వ్యవస్థకు ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. చరిత్రాత్మక తీర్పు అని కొనియాడారు.

### న్యాయవ్యవస్థ మితిమీరిన జోక్యమే కేరళ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్

బిల్లులపై రాష్ట్రపతి నుంచి గవర్నర్ వరకు నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనిని న్యాయవ్యవస్థ 'మితిమీరిన జోక్యం'గా అభివర్ణించారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించాలా? వద్దా? అనేది పూర్తిగా పార్లమెంటు పరిధిలోని విషయమని, ఇది కోర్టుల పరిధిలోది కాదని ఆర్లేకర్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం పరిశీలనకు పంపించాల్సిందని అభిప్రాయపడ్డారు.


### గవర్నర్ కార్యాలయాన్ని చులకన చేసే ఉద్దేశం లేదు

పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంప్రదాయాల పరిరక్షణ కోసమే రాష్ట్ర ప్రభుత్వాల బిల్లుల ఆమోదానికి నిర్ణీత కాలవ్యవధిని నిర్ణయించామని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రత్యేకంగా పేర్కొంది. గవర్నర్ కార్యాలయాన్ని చులకన చేయాలన్న ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. చట్టసభల ద్వారా వ్యక్తమయ్యే ప్రజల ఆకాంక్షను, ఎన్నికైన ప్రభుత్వాల అభిప్రాయాలను గౌరవించాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాజకీయాలకు అతీతంగా ఒక స్నేహితునిగా, మార్గదర్శిగా, రాజ్యాంగ పరిరక్షకుడిగా గవర్నర్ హుందాగా వ్యవహరించాలని ఆకాంక్షించింది. రాష్ట్ర పాలనాయంత్రాంగం సాఫీగా కొనసాగడానికి, అవరోధాలను తొలగించడానికి గవర్నర్ వివేకం, బుద్ధిసూక్ష్మత ఉపయోగపడాలని పేర్కొంది. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టే సమయంలో రాజ్యాంగంపై చేసిన ప్రమాణాన్ని విధి నిర్వహణలో అమలు చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం సూచించింది. గవర్నర్, రాష్ట్రప్రభుత్వం కలిసికట్టుగా పనిచేయాలని ఆకాంక్షించింది.

# గుండె వ్యాధి గుట్టు సెన్సర్లతో రట్టు!

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**

కొన్నిరకాల గుండె జబ్బులను ప్రాథమికంగా గుర్తించడానికి వైద్యులు స్టెతస్కోపులను ఉపయోగిస్తుంటారు. దానికన్నా మెరుగ్గా పనిచేసే ఒక సాధనాన్ని బ్రిటన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది చేతిలో ఇమిడిపోయే అంత చిన్నగా ఉంటుంది. వైద్య వసతులు పరిమితంగా ఉన్నచోట్ల గుండె ఆరోగ్య పరిశీలనకు ఇది బాగా ఉపయోగపడుతుందని పరిశోధకులు చెబుతున్నారు.గుండె కవాట వ్యాధి (వీహెచ్‌డీ) కేసులు నానాటికీ పెరుగుతున్నాయి. తమకు ఈ వ్యాధి ఉన్న విషయం.. బాధితుల్లో దాదాపు సగం మందికి తెలియదు. వ్యాధి ముదిరాకే వైద్యులను సంప్రదిస్తుంటారు. అయితే రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడానికి, వారిపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి వీహెచ్‌డీని ఆరంభంలోనే గుర్తించడం చాలా కీలకం.




### స్టెత్ సామర్థ్యం అంతంతే..

గుండె కవాట వ్యాధి లక్షణాలు.. చాలావరకూ శ్వాస సంబంధిత రుగ్మతలను పోలి ఉంటాయి. ఈ గందరగోళం కారణంగా.. వీహెచ్‌డీ లక్షణాలతో తమను సంప్రదించేవారిలో 38 శాతం మందిని మాత్రమే వైద్యులు స్టెతస్కోపుతో పరిశీలిస్తుంటారు. దీనికితోడు ఈ వ్యాధిని గుర్తించడంలో దీని సామర్థ్యం అంతంతే. నిర్ధారణ కోసం వైద్యుడు.. రోగిని నిశితంగా పరీక్షించాల్సి ఉంటుంది.స్టెతస్కోపుతో పరిశీలన కోసం రోగి పాక్షికంగా దుస్తులు విప్పాల్సి ఉంటుంది. ఇది వారికి అసౌకర్యం కలిగిస్తుంది. ముఖ్యంగా ఆడవారికి ఇబ్బందికరం.వీసీడీని అత్యంత కచ్చితంగా గుర్తించే సాధనం ఎకోకార్డియోగ్రామ్. దీన్ని ఆసుపత్రిలో మాత్రమే నిర్వహిస్తారు.

### ఆరింటితో ఆమూలాగ్రం

స్టెత్ కన్నా సులువుగా ప్రాథమిక స్థాయిలోనే గుండె కవాట వ్యాధిని గుర్తించడానికి బ్రిటన్ శాస్త్రవేత్తలు సరికొత్త సాధనాన్ని రూపొందించారు.కొత్త పరికరం.. స్టెతస్కోపు కన్నా మెరుగ్గా గుండె ధ్వనులను గ్రహిస్తుంది. సాధారణ, ఎలక్ట్రానిక్ స్టెతస్కోపుల్లో ఒకే సెన్సర్ ఉంటుంది. కొత్త పరికరంలో ఆరు సెన్సర్లు ఉంటాయి. దీనివల్ల వైద్యుడు లేదా నర్సు అత్యంత కచ్చితత్వంతో వివరాలను సేకరించగలుగుతారు.నిర్దిష్ట వైద్య శిక్షణ లేకుండా కూడా ఈ సాధనాన్ని వాడొచ్చు. ఛాతీపై సరైన ప్రదేశంలో పెట్టకపోయినప్పటికీ దీని పనితీరులో ఎలాంటి మార్పు ఉండదు. దీని సెన్సింగ్ విస్తృతి ఎక్కువగా ఉండటమే దీనికి కారణం.ప్రకంపనలను కూడా బట్వాడా చేయగలిగిన ప్రత్యేక పదార్థాలతో ఈ సాధనాన్ని అభివృద్ధి చేశారు. అందువల్ల దాన్ని దుస్తులపై కూడా ఉపయోగించొచ్చు. భారీ సంఖ్యలో రోగులను స్క్రీన్ చేసేటప్పుడు.. వారి గోప్యతకు భంగం కలగకుండా, వేగంగా పరిశీలనకు ఇది దోహదపడుతుంది.ఈ పరికరాన్ని ఇప్పటికే ఆరోగ్యవంతులపై విజయవంతంగా పరీక్షించారు. తదుపరి దశలో భిన్న రోగులపై పరీక్షించనున్నారు. ఎకో కార్డియోగ్రామ్‌తో దీని ఫలితాలను పోల్చి చూడాలని భావిస్తున్నారు.

### ఏఐతో ఆటోమేటిగ్గా..

తాజా సాధనం నమోదు చేసిన గుండె శబ్దాల ఆధారంగా ఆటోమేటిగ్గా కవాట వ్యాధిని గుర్తించేందుకు ఒక మెషిన్ లెర్నింగ్ అల్గోరిథమ్‌నూ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ రుగ్మతను గుర్తించడంలో ఇది వైద్యుడి కన్నా మెరుగ్గా వ్యవహరించినట్లు తేలింది.

# తొమ్మిది లీటర్ల దేశిదారు మద్యం స్వాధీనం

**కరపత్రం, ఏప్రిల్ 13 (మంచిర్యాల బ్యూరో):-**

జిల్లాలోని బెల్లంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అక్రమంగా దేశిదారు మద్యం కలిగి ఉన్న నిందితురాలని అదుపులోకి తీసుకొని, తొమ్మిది లీటర్ల దేశిదారు మద్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని బెల్లంపల్లి 2 టౌన్ ఎస్ఐ కే మహేందర్ తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశిదారు మద్యం కలిగి ఉన్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తికి చెందిన కోట సారమ్మ వద్ద నుండి తొమ్మిది లీటర్ల దేశిదారు మధ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆమె ను అదుపులోకి తీసుకుని, పంచనామా నిర్వహించి, అనంతరం ఆమెపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

